



సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్‌ఐ నాయకులు



కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న జయరామిరెడ్డిని పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి జడ్‌పిటిసిపై దాడి

ప్రజాశక్తి-గోపవరం

తెలుగుదేశం పార్టీకి చెందిన జడ్‌పిటిసి అలవాయి జయరామిరెడ్డిపై వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన వేణుగోపాల్‌రెడ్డి అనుచరులు దాడి చేశారు. మంగళవారం తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో ఇంటి వద్ద జయరామిరెడ్డి నిద్రిస్తున్న సమయంలో వేణుగోపాల్‌రెడ్డి అనుచరులైన సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరు మహిళలతో పాటు జయరామిరెడ్డికి గాయాలయ్యాయి. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర జిల్లాలో జరుగుతున్న నేపథ్యంలో జనసమీకరణ చేస్తుండగా ఓర్చుకోలేక జయరామిరెడ్డి, ఆయన ఇంటిపై దాడి చేశారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ నిన్ను చంపేస్తే మళ్లీ ఎన్నికలు వస్తాయని, అప్పుడు తామే గెలుస్తామంటూ దాడిచేసిన వారు అరుస్తూ వెళ్లారని బాధితుడు బద్వేలు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బద్వేలు ప్రభుత్వ ఆస్పత్రిలో జయరామిరెడ్డికి ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు మెరుగైన చికిత్స కోసం తరలించారు. ఈ సంఘటనపై బద్వేల్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న జడ్‌పిటిసి జయరామిరెడ్డిని మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు. దాడిని వారు తీవ్రంగా ఖండించారు. దాడిచేసిన వారిపై కఠిచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దళితుల భూములకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

మండలంలోని దళితులకు చెందిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, అగ్రకులాలు లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారని, దళితులకు తీరని అన్యాయం జరుగుతుందని, వారి భూములకు రక్షణ కల్పించాలని దళిత సంఘాల నాయకులు తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. త్వరలో నిర్వహించబోయే అసైన్‌మెంట్ కమిటీలో దళితులకు చెందిన బంజరు భూములు వారికే అందజేయాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ దళితుల పక్షాన నిలబడి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దళిత సంఘాల నాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి కో-ఆర్డినేటర్ ముళ్లపాటి పిచ్చయ్య, దళిత సామాజిక సంఘాల నాయకులు ఇండ్ల రామసుబ్బయ్య, నాయకులు ముత్యాల చెన్నారాయుడు, పూలే అంబేద్కర్ రాజ్యాధికారి సమితి పోరుమామిళ్ల మండల అధ్యక్షులు ముండ్లపాటి ప్రకాశం, మీడియా ప్రతినిధి వరికుంట్ల పుల్లయ్య పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కడప : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో ఈనెల 12 నుంచి బ్యూటీ పార్లర్ అండ్ మేనేజ్మెంట్ కోర్సులో, ఈనెల 7 నుంచి గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ ప్రారంభం అవుతుందని, ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. 18-45 సంవత్సరాల లోపు వయసు కలిగిన గ్రామీణ ప్రాంతానికి చెందిన నిరుద్యోగ మహిళలు ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులని తెలిపారు. చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9440905478, 630283 3546 నంబర్లకు ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు అని తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప

వైఎస్‌ఆర్ జిల్లా పరిధిలోని కడప శంకరాపురంలో ఉన్న ప్రభుత్వ అంధ బాలుర వసతి గృహంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఆర్. వి. కృష్ణ కిషోర్ తెలిపారు. బ్రెయిలీ లిపిలో ప్రత్యేక బోధన, ప్రభుత్వ విలువ ప్రకారం పౌష్టికాహార భోజనం, కాస్మోటెక్స్, నాలుగు జాతుల బట్టలు, ప్లేట్లు, గ్లాసుల ట్రంకు పెట్టె మొదలైనవి ఉచితంగా అందజేస్తారని పేర్కొన్నారు. గృహంలో మొత్తం 100 మందికి ప్రవేశం ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ దరఖాస్తులను కడప శంకరాపురంలోని ప్రభుత్వ అంధ బాలుర వసతిగృహం వార్డెన్‌కు సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7396412434లో ఫోన్ ద్వారా సంప్రదించవచ్చు అని తెలిపారు.

వైవీయూ బిఇడి, ఎంఇడి సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బిఇడి, ఎంఇడి మూడో సెమిస్టర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విసి ఆచార్య చింతా సుధాకర్ వెల్లడించారు. మంగళవారం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్‌లో జిల్లా వ్యాప్తంగా జరిగిన బిఇడి పరీక్షలకు 2,342 విద్యార్థుల హాజరు కాగా 2,240 ఉత్తీర్ణత పొందారని , 95.64 శాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. ఇదే తీరులో ఎంఇడి పరీక్షలు 98 మంది రాస్తే అందులో 80 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఇందులో 81.63 శాతం ఉత్తీర్ణత నమోదయింది అన్నారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆదినారాయణ రెడ్డి పాల్గొన్నారు.

అరుదైన గురువు దాదాపీర్

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

నిమిషం నిబం ధనతో విధులు నిర్వహించే అరుదైన గురువు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ అని పోరుమామిళ్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో దాదాపీర్‌ను సర్పంచ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ మాట్లా డుతూ విధి నిర్వహణలో ఒక్క నిమిషం ఆలస్యంగా వెళ్లినా, లేదా ఒక్క నిమిషం ముందుగా ఇంటికి వెళ్లినా ఆరోజు జీతం పాఠశాలకే చెల్లించేలా నిబంధన విధిం చుకొని విధులు నిర్వహించే ఒకే ఒక్క గురువు దాదా పీర్ అని కొనియాడారు. నెల రోజులుగా వేసవి సెలవులు అయినప్పటికీ ప్రతిరోజు గ్రంథాలయానికి హాజరవుతూ క్యాంప్ విజయవంతంగా నిర్వహించడంలో దాదాపీర్ కృషి ప్రశంసనీయమన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లవేళలా అందిస్తానని అన్నారు. అనంతరం సర్పంచ్ యనమల సుధాకర్, అంజుమన్ కమిటీ అధ్యక్షులు రాజీవ్‌బాషా, కార్యదర్శి కైజర్ బాష, గ్రంథాలయ అధికారి ఆఫ్రిది విద్యార్థులు దాదా పీర్‌ను ఘనంగా సన్మానించారు. తనను సన్మానించిన ప్రతి ఒక్కరికీ దాదా పీర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెవివి సభ్యులు మహమ్మద్, యాసీన్, ఖాసీం వల్లి, పాఠకులు ఖదీర్ బాష, సుహానా, మోక్షిత పాల్గొన్నారు.



దాదాపీర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్, గ్రంథాలయ ఉద్యోగులు, పాఠకులు

యువతను మోసగించిన సిఎం జగన్

పాదయాత్రలో నారా లోకేష్
కడపలో జననీరజనం
లోకేష్ దృష్టికి సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక యువతను దారుణంగా మోసం చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 118 రోజుకు చేరుకుంది. మంగళవారం కడప శివారులోని బిల్టప్ విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమై కడప నగరంలోని రామకృష్ణ కాలేజి, మాసీమ సర్కిల్, రెండవ గాంధీబొమ్మ, చెన్నూరు బస్టాండ్, మొదటి గాంధీబొమ్మ, గోకుల్ సర్కిల్, కృష్ణదేవరాయ సర్కిల్, శంకరాపురం, అప్సర సర్కిల్, ఎన్‌టిఆర్ సర్కిల్, చిన్నచౌక్, రాజరాజేశ్వరి కల్యాణ మండపం ఎదుట విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో రెడ్డి సామాజికవర్గీయులు, బ్రహ్మణ, ముస్లిములు, వైశ్యులు, నిరుద్యోగులు, దినసరి కూలీలు, స్థానికులతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ అబద్దాలు, మోసం, వంచనకు ప్రతిరూపం జగన్ అని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి ఏటా జాబ్ కేలండర్, 2.3 లక్షల ఉద్యోగాలిస్తానని చెప్పి మోసగించారని తెలిపారు. జగన్ నిర్వాకం కారణంగా తీవ్ర నిరాశ,నిస్పృహలకు గురైన 470 మంది యువతీ యువకులు ఆత్మ హత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతను గంజాయి, మత్తుపదార్థాలకు బానిసలుగా మార్చి, వారి రక్తమాంసాలతో వ్యాపారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక ఒక్క జాబ్ కేలండర్ గానీ, ఉద్యోగం కానీ లేదని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చాక కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణాన్ని వేగవంతం చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వంలో కేవలం నలుగురు రెడ్లు మాత్రమే బాగుపడ్డారన్నారు. సజ్జల, సాయిరెడ్డి, పెద్దిరెడ్డి, సుబ్బారెడ్డికి తప్ప ఏ ఇతర కుటుంబానికి న్యాయం జరగలేదని చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తామన్నారు. దానిమ్మ, అరటి, బొప్పాయి, మామిడి, కర్జూరం తదితర పంటలు వేసేలా అధిక ప్రోత్సాహం ఇస్తామని తెలిపారు. రాయలసీమ రైతులకు సరైన ప్రోత్సాహం ఇస్తే బంగారం పండిస్తారని చెప్పారు. పరిపాలన ఒకే చోట అభివద్ధి వికేంద్రీకరణ టిడిపి నినాదమన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చి స్థానికంగా ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఫ్యాక్షన్‌లో ఇబ్బంది పడిన కుటుంబాలను ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆదుకుంటున్నామన్నారు. రెడ్డి కార్పొరేషన్ పెట్టడమే తప్ప జగన్ ఒక్క రూపాయి కేటా యించలేదని విమర్శించారు. రైతులకు కులం ఉండదని, ఇప్పుడు రైతుల్లో కూడా జగన్ ప్రభుత్వం కులం చూస్తోందన్నారు. మోటార్ల మీటర్లు పెట్టి రైతులను వైసిపి ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన పౌరసేవ లందించేందుకు ఉద్దేశించిన మీ సేవ వ్యవస్థను జగన్ నిర్వీర్యం చేశారన్నారు. మీ-సేవల ద్వారా వచ్చే ఆదాయాన్ని తీసుకుంటూ అక్కడ పనిచేసే సిబ్బందిని మాత్రం రోడ్డున పడేశారని తెలిపారు. వారికి 12 నెలలుగా జీతాలు ఇవ్వకపోగా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 171 గవర్నమెంట్ అర్బన్ మీసేవ కేంద్రాలను ఎటువంటి నోటీసు లేకుండానే స్వాధీనం చేసుకొని తీవ్ర అన్యాయం చేశారని పేర్కొన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక కులానికొక కుర్చీలేని కార్పొరేషన్ ఏర్పాటు చేసి అన్నివర్గాలను దారుణంగా మోసగించారని తెలిపారు. మైనారిటీల మానప్రాణాలతో పాటు ఆస్తులకు రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా వేలకోట్ల రూపాయల మైనార్టీల ఆస్తులను వైసిపి నేతలు కబ్జా చేశారని విమర్శించారు. యువతకు తీరని ద్రోహం చేశారని తెలిపారు. కడప స్టీల్ ప్లాంట్‌కు రెండుసార్లు శిలాఫలకాలు వేసిన జగన్ ఆ పనులను అడుగు ముందుకు కదల్చలేదన్నారు.



కడపలో ప్రజలకు అభివాదం తెలియజేస్తున్న నారా లోకేష్

తప్పులు చేస్తే సహించేది లేదు

-ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కె. సంతోష రావు

ప్రజాశక్తి - కడప

ఉద్యోగి సంతోషంగా ఉంటే మొట్టమొదట ఆనందించే వ్యక్తిని తానేనని, తప్పులు చేస్తే సహించేది లేదని ఎపిఎస్‌డిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) కె. సంతోష రావు హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. మంగళవారం కడప విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ 2022-23 వ ఆర్థిక సంవత్సరానికి గాను ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లాలో అత్యధికంగా 12551 వ్యవసాయ సర్వీసులు విడుదల చేసినందుకు అధికారులను అభినందించారు. వ్యవసాయానికి సంబంధించిన విద్యుత్ కోసం ప్రతి యూనిట్‌కు అత్యధికంగా రూ. 7.72 ప్రభుత్వం చెల్లించి, ప్రభుత్వము రైతులకు ఉచితంగా విద్యుత్ ఇస్తుందని తెలిపారు. ఒక వ్యవసాయ సర్వీసు వెంటనే త్వరగా విడుదల చేయడం వల్ల సంస్థకు మేలు జరుగుతుందని తెలుసుకోవాలన్నారు. డిబిటి పథకం ద్వారా రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడమే కాకుండా సంస్థకు ప్రతి యూనిట్ అకౌంటబిలిటీలోకి వస్తుంది అని చెప్పారు. డిబిటి పథకం నిర్వహించడానికి రైతుల వద్ద నుంచి బ్యాంకు వివరాలను వెంటనే తీసుకోవాలని ఆదేశించారు. జగనన్న కాలనీలో ఎవరికైనా విద్యుత్ సర్వీసు కావాలంటే యుద్ధ ప్రాతిపదికన వారికి మీటర్ బిగించాలని వారి నుండి విద్యుత్ సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందస్తుగా లైన్లను విధిగా పరిశీలించి సమస్యలను గుర్తించి ముందస్తుగా మరమ్మతులు చేసి నాణ్యమైన విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అత్యధికంగా విద్యుత్ బకాయిలు పేరకపోయ్యాయని, వీటి వసూలుపై దృష్టి సారించాలని అధికారులకు తెలియజేశారు. సిబ్బంది తాము చేయగలిగిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తే మంచి ఫలితాలు వస్తాయని తెలియజేశారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులకు అంతరాయాలు లేని నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. సమావేశంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ కె. శివప్రసాద్ రెడ్డి, ఒఎస్‌డి ఎన్. శ్రీనివాసులు, చీఫ్ జనరల్ మేనేజర్స్ ధర్మగ్ని గురవయ్య, విద్యుత్ ఎస్‌ఇ ఎస్.రమణ, ఉమ్మడి జిల్లాల అకౌంట్ ఆఫీసర్ మధు, ఉమ్మడి జిల్లాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈ లు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ సిఎండి సంతోషరావు



మాట్లాడుతున్న విసి చింతా సుధాకర్

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

కళాశాలలు తెరిచే నాటికి వసతి గృహాలు అన్ని సిద్ధం చేయాలని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య చింతా సుధాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉన్న వసతి గృహాలను విశ్వవిద్యాలయ చీఫ్ వార్డెన్, ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథరెడ్డి, రిజిస్టర్ ఆచార్య వై..పి వెంకటసుబ్బయ్య, ఇంజినీరింగ్ అధికారులతో కలసి సందర్శించారు. అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని, మరి ముఖ్యంగా అన్ని గదుల్లో వెలుతురు ఉండేలా లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 19 నాటికి విద్యార్థులు రానున్నారని, ఏ చిన్న అసౌకర్యం కలగకూడదని సూచించారు.అనంతరం విశ్వవిద్యాలయం ఇంజినీర్లతో వైవీయూ ఉప కులపతి సమీక్ష సమావేశం నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, వాటి ప్రగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. విధి నిర్వహణలో ప్రతి బాధ్యతగా వ్యవహరించాలని, సమయపాలన పాటించాలని సూచించారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి : ఎస్‌ఎఫ్‌ఐ

రాయచోటి టౌన్ : కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థల యాజమాన్యం ఫీజుల దోపిడీని అరికట్టాలని, జీవో నంబర్ 1,42లను అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కార్తీక్, నరసింహ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్లీనరీ సమావేశాలలో తీసుకున్న నిర్ణయలపై జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉదృతం చేస్తామని అన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలు డిసెంబర్ నుంచే పిఆర్‌ఒలను పెట్టి అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని చెప్పారు. విద్యను అంగట్లో సరుకులాగా కిలోల ప్రకారం అమ్మకానికి పెట్టారని మండపడ్డారు. అక్షరాలపై లక్షల వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థలపై విద్యా శాఖాధికారులు చర్యలు తీసుకోవడంతో పూర్తిగా విఫలం చెందారని పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కి పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ తదితర స్టడీ మెటీరియల్ అంతా ఆయా పాఠశాలల్లోనే కొనుగోలు చేయాలని బయట కొనుగోలు చేసిన పుస్తకాలు తమ పాఠశాలలో ఉపయోగపడని రూ. 5 వేల నుంచి రూ. 8 వేలకు పైగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ టెస్ట్, ఫీజు వసూలు చేస్తున్నారని తెలిపారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

- వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుమ్మ రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చెన్నూరు

తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ తన యువ గళం పాదయాత్రలో భాగంగా చెన్నూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని, కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డిని విమర్శించడం తగదని, విమర్శించేటప్పుడు నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎల్లమ్మ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏదైతే పేపర్లలో రాసి ఇచ్చారో దానిని లోకేష్ చిన్నపిల్లాడిలా చదవడం తప్ప, అందులో నిజానిజాలు తెలుసుకునే ప్రయత్నం చేయలేదని పేర్కొన్నారు. కమలాపురం శాసనసభ్యులు రవీంద్రనాథ్ రెడ్డి, తాను ఎక్కడా ఒక సెంటు భూమి అక్రమంగా తీసుకోలేదన్నారు. తాను టిడిపికి చెందిన ప్రముఖ డాక్టర్ కృష్ణ కిషోర్ రెడ్డి వద్ద కొనుగోలు చేశానని తెలిపారు. టిడిపికి చెందిన రామకోటి రెడ్డి 50 ఎకరాల డాటర్ ల్యాండ్‌ను రెగ్యులర్ చేసుకున్నప్పుడు, వారికి ఆ భూములు కనపడలేదా అని ప్రశ్నించారు, వైసిపి మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రజల వద్దకే పాలన అనే నినాదంతో, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ క్లినికులు, పాల కేంద్రాలు, ఏర్పాటుచేసి ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని చెప్పారు. ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, అటవీ శాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికార దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు చేపట్టడమేగాక వారికి అండగా నిలిచారని చెప్పారు. ఇవేవీ తెలుసుకోకుండా ముఖ్యమంత్రిని, కమలాపురం శాసనసభ్యులు రవీంద్రనాథ్ రెడ్డిని భూ బకాసురుడు అనడం లోకేష్ మూర్ఖత్వానికి నిదర్శనమని తెలిపారు. సమావేశంలో మండల కో -ఆప్షన్ నెంబర్ వారీస్, మోహన్ రెడ్డి, ముది రెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్ తుంగ చంద్రశేఖర్ యాదవ్, శ్రీనివాసరాజు ,పట్టాభిరామిరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, పిచ్చయ్య, చంద్ర ఓబుల రెడ్డి, రామాంజనేయులు, సీతారాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్‌రెడ్డి

రైల్వే శాఖలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి- కడప అర్బన్

కేంద్రంలో రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న 3.15 లక్షల పోస్టులు భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద రవాణా సంస్థ అయిన రైల్వే శాఖలో కేంద్ర ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. రైల్వే శాఖలో దాదాపు 3.15 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని ఎందుకు ఏటా భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. ఏటా ఖాళీలు రైల్వేలో భర్తీ చేయ కపోవడంతో పనిఒత్తిడితో ఉద్యోగులు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో రైల్వే ప్రమాదాలు కూడా ఒక కారణం అవుతుందన్నారు. రైల్వే ప్రమాదాల నివారణకు బిజెపి ప్రభుత్వం చర్యలు చేపట్టడంలో ఘోర విఫలం చెందాయని పేర్కొన్నారు. మోడీ వందే భారత్ రైళ్ల ప్రారంభోత్సవంలో చేసే ప్రచార ఆర్భాటాలు తప్ప చేసింది శూన్యమన్నారు. ప్రచారమోడీ ఎన్నికల ప్రచారంలో బిజెపి అధికారంలోకి వస్తే ఏటా కోటి ఉద్యో గాలు యువతకు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ప్రయివేటీకరణ పేరుతో అన్నింటినీ అమ్మే వాటి పై ఉన్న శ్రద్ధ కాపాడటంలో బిజెపికి లేదన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఒడిశా రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత ముమ్మాటికీ బిజెపి ప్రభు త్వానిదే అన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు పాల్గొన్నారు.

19న రాయలసీమ బహుజన రాజ్యాధికార సభ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాయలసీమ బహుజన రాజ్యాధికార సభ ఈ నెల 19న మదనపల్లిలో నిర్వహిస్తున్నట్లు బిఎస్‌పి జిల్లా ఇన్‌ఛార్జి గుర్రప్ప పేర్కొన్నారు. మంగళవారం బిఎస్‌పి జిల్లా కమిటీ సమావేశం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో జిల్లా అధ్యక్షులు డి.ఎస్.జయరామ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుర్రప్ప మాట్లాడుతూ బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి ఆదేశాల మేరకు మదనపల్లిలో రాయలసీమ బహుజన రాజ్యాధికార సభ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతం కుమార్ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తామని చెప్పారు. ముఖ్య అతిథులుగా జాతీయ కో-ఆర్డినేటర్ ఆకాశ ఆనంద్, 17 రాష్ట్రాల ఇన్‌ఛార్జి, ఎంపీ రాంజీ గౌతమ్, రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి, కో-ఆర్డినేటర్ బాలయ్య, ఆర్జే మలికల్, సంపత్ రావు, చిత్ర సేన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, నాయకులు హాజర వుతారని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబయ్య, జిల్లా కోశాధికారి రాజగోపాల్, జిల్లా నాయకులు బాబు, మైదుకూరు అసెంబ్లీ అధ్యక్షులు నాగార్జున, బద్వేల్ అధ్యక్షులు గౌస్ పీర్, కమలాపురం అసెంబ్లీ అధ్యక్షులు రాజన్న, ప్రొద్దుటూరు అసెంబ్లీ అధ్యక్షులు వెంకటనారాయణ, బాషా, కడప రవి, మైదుకూరు అసెంబ్లీ సోమశేఖర్, బాలుడు పాల్గొన్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి సడలింపులు ఎత్తివేయాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరారు. మంగళవారం కలెక్టర్ విజయరామరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చి,న వెంటనే కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికి సడలింపు (5 సంవత్సరాలు) రద్దు చేసి అందరిని రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

సిఎం నిర్ణయం హర్షణీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని వైఎస్‌ఆర్‌టియుసి మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంగల్‌రెడ్డి, మేసా ప్రసాద్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడం అభినందనీయమని తెలిపారు.

జెడి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వై.కామేశ్వరప్రసాద్, పిఫెర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, కన్సలెంట్ ఎ.సుకుమార్ జిల్లాలో హెచ్‌ఐవి, ఎయిడ్స్ పై జరుగుతున్న సేవలను ఆకస్మిక తనీఖీ చేశారు. మంగళవారం జిల్లాలో కేసుల వివరాలు, ఎఆర్‌టి మందులు, వైరస్ లోడ్, ల్యాబ్స్ పనితీరు, కౌన్సిలర్ రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్.కె.ఖాదర్‌వల్లి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, డిఐఎస్ పి.వి.ప్రసాద్, డిఎంఇ సిలార్ పాల్గొన్నారు.



ఎన్‌ఐఆర్‌ఎఫ్- ఇన్నోవేషన్ రాంకుల్లో మెరిసిన కెఎస్‌ఆర్‌ఎం

ప్రజాశక్తి- కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వ విద్య మంత్రిత్వ శాఖ సోమవారం విడు దల చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ ఇన్నోవేషన్ - 2023 ముసాయిదా ఇంజినీరింగ్ విభాగంలో కెఎస్‌ఆర్‌ఎం కళాశాల 150 -300 జాబితాలో ఎంపికైందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివిఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ఎన్‌ఐఆర్ ఎఫ్ ఇన్నోవేషన్‌లో ఉత్తమ ర్యాంకింగ్ కోసం దేశంలోని వివిధ దిగ్గజ విద్యా సంస్థలు ఐఐటిలు, ఎన్‌ఐటిలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, రాష్ట్రీయ విశ్వవిద్యాలయాలు, అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలు పాల్గొన్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 12 ప్రముఖ ప్రయివేట్ ఇంజనీరింగ్ కళాశాలలు 150 -300 ర్యాంకింగ్ జాబితాలో చోటు సంపాదించుకోగా అందులో కెఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల ఎంపిక కావడం హర్షణీయమన్నారు. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ఇన్నోవేషన్‌లో మంచి ర్యాంకింగ్ రావడానికి కృషి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్మోహన్ రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, కళాశాల రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ విభాగ సిబ్బంది,అధ్యాపక సిబ్బంది గొప్ప విజయాన్ని సాధించినందుకు అభినందనలు తెలిపారు. అధ్యాపకులందరూ కొత్త ఆవిష్కరణలు, ఇంకుబేషన్లు, స్టార్టప్ పై దృష్టి సారించాలని, పరిశోధనలో చురుగ్గా పాల్గొనాలని కళాశాల అభివృద్ధికి అధ్యాపక సిబ్బంది మరింత కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్యేను విమర్శించే అర్హత లోకేష్‌కు లేదు

ప్రజాశక్తి - కడప

కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డిని విమర్శించే అర్హత నారా లోకేష్‌కు లేదని వైసిపి సీనియర్ నాయకులు, వైఎస్ జగన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయం విలేకరులతో మాట్లాడుతూ కమలాపురం శాసన సభ్యులు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజల ఆదరణతో రెండుసార్లు ఎమ్మెల్యేగా, జడ్‌పిటిసిగా, కడప మేయర్‌గా ప్రజలు ఆశీస్సులతో గెలుపొందారని తెలిపారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని మంత్రి పదవి పొందిన సంగతి అందరికీ తెలుసునన్నారు. కమలాపురం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రూ. కోట్ల నిధులను తెచ్చి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. చౌకబారు మాటలు మానుకోవాలని నారా లోకేష్ కు హితువు పలికారు.


సిబ్బందితో మాట్లాడుతున్న జెసి గణేష్

భూముల రీసర్వే త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

జగనన్న సమగ్ర భూ సర్వే త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జెసి, ఆర్‌డిఒ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులు, కంప్యూటర్ గదులను పరిశీలించారు. జగనన్నకు చెబుదాం వినతులు గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వే డిటి సౌజన్య, సర్వేయర్ విజయభాస్కర్, విఆర్ఒ పాల్గొన్నారు.

నైతిక బాధ్యతగా రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


మాట్లాడుతున్న నజీర్

దేశరైల్వే చరిత్రలోనే ఒడిసాలో జరిగిన అత్యంత ఘోరమైన రైలు దుర్ఘటకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీతోపాటు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, రైల్వే అధికారులు తమ అసమర్థతను కప్పిపుచ్చేందుకు ఈ రైలు ప్రమాదాన్ని సిబిఐకి అప్పగించడం తగదన్నారు. సిబిఐ కేంద్ర పాలకుల చేతిలో ఉంటుంది కాబట్టి, వారికి అనుకూలంగా మలచుకుంటారని ఆరోపించారు. ఈ విచారణ వల్ల ప్రజలకు నమ్మకం లేదన్నారు. రైలు ప్రమాదంలో మృతి చెందిన ప్రతి ఒక్కరికీ రూ.50లక్షల పరిహారంతోపాటు వారి కుటుంబంలో విద్యార్హతను బట్టి ప్రభుత్వోద్యోగం కల్పించాలన్నారు. సమావేశంలో మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు రవి, పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు భాస్కర్, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షుడు సైమన్, మండల ఇన్‌ఛార్జి రామాంజనేయులు పాల్గొన్నారు.

రూ.35 వేలు కట్టించాలి

- మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలో నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ లేఅవుట్ లబ్ధిదారులు ప్రతి ఒక్కరితోనూ రూ.35 వేలు కట్టించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మహిళ రిసోర్స్ పర్సన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ కాలనీ లబ్ధిదారులతో కలిసి వారికి తగు సూచనలిచ్చి డబ్బు కట్టించేలా ప్రయత్నం చేయాలన్నారు. అలాగే ఈనెల 8న నిర్వహించే ఆదిత్య బిర్లా కుట్టు మిషన్ ఇంటర్వ్యూలకు పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, పట్టణ మెప్మా అధికారి గంగులయ్య, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేష్‌రెడ్డి

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

జగనన్న ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ హౌసింగ్ కృష్ణయ్య అధికారులకు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పట్టణ పరిధిలోని జగనన్న హౌసింగ్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ ఇంటి నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. క్యూరింగ్ విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డిఇ జివి రమణారెడ్డి, హౌసింగ్ ఎఇ సంజీవరాయుడు, సచివాలయం ఇంజనీర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీడీ కృష్ణయ్య

ఆదర్శంగా వాలంటీర్ వ్యవస్థ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాలంటీర్ వ్యవస్థ పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని కౌన్సిలర్ తుంగా వెంకటరామిరెడ్డి తెలిపారు. స్థానిక మహేశ్వర్ నగర్‌లోని 3వ సచివాలయ పరిధిలోని వాలంటీర్లకు మంగళవారం సచివాలయ కార్యాలయంలో ఆయన వాలంటీర్లకు సేవా మిత్ర అవార్డులను ప్రదానం చేశారు. 4వ వార్డు కౌన్సిలర్ కల్లూరు సునీత మాట్లాడుతూ వాలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా అవార్డులతోపాటు నగదును బహుకరించడం హర్షించదగ్గ విషయమన్నారు. అలాంటి వ్యవస్థను ప్రవేశపెట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అవార్డుల ప్రదానంలో 19 మంది వాలంటీర్లకు సేవా మిత్ర అవార్డుతోపాటు ప్రశంసాపత్రాలు, రూ.10వేల నగదు అందించారు. సేవా మిత్ర అవార్డు గ్రహీతలకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ నాగిరెడ్డి, సచివాలయ అడ్మిన్ హారిక, సిబ్బంది విజయ్, భార్గవి, విఆర్ఒ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


వాలంటీర్లను సన్మానిస్తున్న కౌన్సిలర్ తుంగా వెంకటరామిరెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో సర్వేయర్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల


గాయపడిన మనీషా

మండలంలోని నిడుజివ్వి గ్రామం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామ రెవెన్యూ సర్వేయర్ మనీషాకు తీవ్ర గాయాలయ్యాయి. విధులు ముగించుకొని సొంత గ్రామం తిప్పలూరుకు తన స్కూటీపై వస్తుండగా, నిడుజీవ్వి వద్ద ఎదురుగా ద్విచక్ర వాహనం ఢీకొందని స్థానికులు తెలిపారు. మనీషాను హుటాహుటిన 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కెసి కాలువలో నీరు పారేదెలా..!

ప్రజాశక్తి - చాపాడు


కోతకు గురవుతున్న కెసి కాలువ


కాలువలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

జిల్లాలోనే అధికంగా వ్యవసాయానికి సాగునీరు అందించే వనరుల్లో కెసి కెనాల్ ప్రధానమైంది. జిల్లాలో దాదాపుగా 92 వేల ఎకరాలకు కెసి కెనాల్ సాగునీరందించే అవకాశం ఉంది. అయితే కాలువల నిర్వహణ సరిగా లేకపోవడంతో పూర్తిస్థాయిలో వ్యవసాయానికి నీరు అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. చివరి ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు జిల్లా చాగలమర్రి మండల పరిధిలో రాజోలి ఆనకట్ట వద్ద నుండి జిల్లాలోని దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ప్రొద్దుటూరు మండలాల పరిధిలోని రాజుపాలెంతోపాటు చెన్నూరు, కడప మండలాల్లో కేసి కాలువకు నీరు పంట పొలాలకు అందించాల్సి ఉంది. అయితే కెసి కాలువ వెంబడి కంప చెట్లు విపరీతంగా పెరిగి కాలువ బలహీనపడుతోంది. కొన్ని ప్రదేశాల్లో సిమెంట్ లైనింగ్ దెబ్బతిని కాలువ కోతకు గురవుతోంది. కాలువలో పూడికతీత పనులను ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో పూడికతీత సమస్య అంతగా కనిపించడంలేదు. ఏటూరు కాలువలో ఉపాధి పనులు చేపట్టారు. మైదుకూరు మునిసిపాలిటీ పరిధిలో మాత్రం పూడిక సమస్య ఉంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం సెట్టర్లు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. మైదుకూరు నుండి కొండపేట కాలువలో ఆకులు, అలములు అధికంగా ఉండడంతో నీటి ప్రవాహానికి ఇబ్బందికరంగా ఉంది. అలాగే పట్టణ పరిధిలో ఉన్న కాలువలలో వ్యర్థ పదార్థాలు వేస్తుండడంతో రైతులకు ఇబ్బందిగా తయారైంది. చాపాడు ఛానల్ ద్వారా చివరి ఆయకట్టుకు కాలువలలో వ్యర్థపదార్థాలు, లైనింగ్ పనులు దెబ్బతినడంతో నీటి ప్రవాహం సజావుగా సాగడం లేదు. కాలువలను పరిరక్షించే సిబ్బంది కొరత అధికంగా ఉంది. ఈ కారణంగా అక్రమ నీటి వాడకం, నీటి వృథా జరుగుతోందనే విమర్శలున్నాయి. ఆగస్టు మొదటివారంలో కెసి కాలువకు నీరు విడుదల చేసే అవకాశాలున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు స్పందించి కాలువలో అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హామీలు నెరవేర్చకపోతే పోరాటాలు


మాట్లాడుతున్న విఆర్‌ఎల సంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్ర

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేరకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని విఆర్‌ఎల సంఘం జిల్లా కన్వీనర్ నాగేంద్ర తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రతిపక్ష నాయకుడిగా పాదయాత్ర చేస్తున్న సందర్భంలో మీకు నేనున్నాను, నేను విన్నాను.. ఖచ్చితంగా మన అందరి ప్రభుత్వం వచ్చిన వారంలోపే గ్రామ సేవకులకు రూ.15,000 పెంచుతానని, ప్రమోషన్లు కల్పిస్తామని, వారసత్వం కొనసాగిస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లవుతున్నా విఆర్‌ఎల సమస్యలు ఒకటి కూడా పరిష్కరించకపోగా ఉన్న జిఒలోనే కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకొక్క విఆర్ఎతో రూ.19,500 రికవరీ చేసుకోవడం, జీతాలు పెంచక అప్పుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్ తక్షణమే విఆర్‌ఎలకు న్యాయం చేయలని డిమాండ్ చేశారు. గ్రామ సేవకులకు తక్షణమే పేస్కేలు అమలు చేసి రూ.26 వేల జీతం ఇవ్వాలన్నారు. ప్రమోషన్స్, నామిని, విఆర్‌ఎలను గుర్తించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 9న జరిగే విఆర్‌ఎల కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని నాగేంద్ర కోరారు. కార్యక్రమంలో సిఐటియు అనుబంధ విఆర్‌ఎల సంఘం నాయకులు నరసింహ, రాజన్న, శ్రీను, ఓబులేసు పాల్గొన్నారు.

నత్తనడకన పనులు.. అవస్థల్లో ప్రజలు

ప్రజాశక్తి - వేంపల్లె


అసంపూర్తి పనులను పరిశీలిస్తున్న తులసిరెడ్డి, నాయకులు

వేంపలలో అండర్‌గ్రౌండ్ డ్రయినేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. తీసిన గుంతలను మంగళవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి తులసిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రయినేజీకి ఏడాది క్రితం సిఎండిఎఫ్ కింద రూ.92 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. 80 కిలోమీటర్లుకుగాను 20 కిలోమీటర్లు మేరకు రాజీవ్‌నగర్, మదీనాపురం, చింతలమడుగుపల్లెలో పనులు పూర్తయినట్లు తెలిపారు. 60 కిలోమీటర్లు పనులు ఇంకా మొదలు కాలేదన్నారు. పూర్తి అయిన చోట గుంతలను సరిగా పూడ్చకపోవడంతో నడి రోడ్డులో ఎగుడు, దిగుడుగా ఉన్నందున పాదచారులకు, వాహన దారులకు తీవ్ర అసౌకర్యంగా ఉందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని తులసిరెడ్డి కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్, రామకృష్ణ, బాలం సుబ్బరాయుడు, నరసింహరెడ్డి, బద్రి, రాఘవయ్య, రవి పాల్గొన్నారు.

అంచలంచెలుగా ఎదుగుతున్న 'జీవనజ్యోతి'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


కరస్పాండెంట్ వై.అమర్‌నాథ్‌రెడ్డి

క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో జీవనజ్యోతి విద్యాసంస్థలు అంచెలంచెలుగా ఎదుగుతున్నాయని విద్యాసంస్థల కరెస్పాండెంట్ వై.అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. సమాజానికి ఉత్తమ విద్యను అందించాలని, తద్వారా దేశా నిర్మాణానికి చక్కటి పౌరులను తయారు చేయాలని 2000లో కేవలం 150 మంది విద్యార్థులతో జీవనజ్యోతి తొలి అడుగువేసిందన్నారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు 15 శాఖలు సుమారు 9వేల మంది విద్యార్థులతో దిగ్విజయంగా దూసుకుపోతోందన్నారు. ప్రొద్దుటూరు పట్టణమంతా 8 శాఖలుగా విస్తరించడంతోపాటు జమ్మలమడుగులో ఒకటి, యర్రగుంట్లలో రెండు, పులివెందులలో ఒకటి, తిరుపతిలో మూడు శాఖలను నెలకొల్పారు. ఇన్ని శాఖలున్నప్పటికీ పేద, మధ్య తరగతి కుటుంబికులు సైతం చక్కగా చదువుకునే విధంగా ఫీజులు నిర్ణయించి కార్పొరేట్ స్థాయికి మించి విద్యనందిస్తున్నారు. ఇరవై ఏళ్లకు పైబడి అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో డిజిటలైజేషన్, కంప్యూటర్ సిస్టమ్ దిశగా విద్యా బోధన సాగుతోంది. క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు ఉల్లాసంగా ఉత్సాహంగా ఆట పాటలతో ఎలాంటి వత్తిడి లేకుండా.. ఇంటి కంటే పాఠ శాలలో ఉండడమే మేలన్నట్లు విద్యాబోధన సాగుతోందన్నారు. జీవనజ్యోతి విద్యాసంస్థలు ప్రారంభం నాటి నుండి నేటి వరకు 50మంది విద్యార్థులకుపైగా మెడికల్ సీట్లు సాధించారని తెలిపారు. అలాగే 460కిపైగా ఐఐటిలో, 70మందికి పైగా ప్రభుత్వోద్యోగాలు,1700మందికి పైగా మంచి వేతనంతో కూడిన ప్రైవేట్ ఉద్యోగాలతో చక్కటి జీవితాన్ని గడుపుతున్నారన్నారు. మూస పద్ధతిలో కాకుండా విద్యావ్యవస్థలో ఎప్పటికప్పుడు ఆవిష్కృతమవుతున్న సంస్కరణలతో బోధన సాగుతోందన్నారు. ఇందుకు ప్రతిసంవత్సరం ఆయా రంగాల్లో నైపుణ్యం సాధించిన నిపుణులతో జీవనజ్యోతి విద్యాసంస్థల ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కరెస్పాండెంట్ తెలిపారు. చదువులో వెనుకబడిన ప్రతి విద్యార్థిపై శ్రద్ధ పెట్టి ప్రత్యేక శిక్షణ ద్వారా మంచి మార్కులు సాధించే విధంగా తయారు చేస్తున్నామన్నారు. తమ విద్యాసంస్థలో చదువుతోపాటు మంచి పౌరుడిగా ఎదిగేందుకు అవసరమైన నైతిక విలువలకు కూడా అధిర ప్రాధాన్యతినిస్తూ సమాజం గర్వించేలా విద్యార్థిని తయారు చేస్తున్నామన్నారు. హాస్టల్ వసతితోపాటు వ్యాన్ సౌకర్యం ఉందన్నారు. తమ విద్యాసంస్థల్లో నర్సరీలో చేరిన విద్యార్థి ఇక్కడి వాతావరణానికి ఆకర్షితుడై పదవ తరగతి వరకు విద్యను కొనసాగిస్తుండడం వల్ల తమ విద్యాసంస్థల ఉన్నతి దినదినాభివృద్ధి చెందుతోందని కరస్పాండెంట్ వై.అమర్‌నాథ్‌రెడ్డి వివరించారు.

ప్రజలకు మెరుగైన సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. మంచి చేస్తున్న ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి జగన్‌పై ఎల్లోమీడియా నిత్యం దుష్ప్రచారం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 19 వార్డులో వైసిపి పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డితో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. స్థానికంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందుతున్న తీరు పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. టిడిపి తన పాలనలో సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. మరో ఏడాదిలో ఎన్నికలు వస్తాయని తెలిసి ఎల్లో మీడియాతో అసత్య ప్రచారాలు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. తాము గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో వెళ్తుంటే.. జగన్ సిఎం అయ్యాకే సంక్షేమ పథకాలు అందుతున్నట్లు జనం చెబుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. స్థానికులు తమ దృష్టికి తెస్తున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్ గౌరీనాథ్, బుజ్జి, సచివాలయ ఉద్యోగులు, వాలంటరీలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను చూపించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



మాట్లాడుతున్న గురుకుమార్

ఉపాధ్యాయ బదిలీల్లో అన్ని క్యాడర్ల ఉపాధ్యాయ ఖాళీలను చూపించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుకుమార్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎస్టియు రీజియన్ కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయుల సమావేశంలో గురుకుమార్ మాట్లాడుతూ అన్ని ఖాళీలను చూపిస్తే సీనియర్ ఉపాధ్యాయులందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఎస్‌టియు జమ్మలమడుగు రీజియన్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్ పాఠశాలలకు పోస్టులు మంజూరు చేస్తూ త్వరగా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. హైస్కూల్ ప్లస్‌కు కావలసిన సౌకర్యాలు త్వరగా కల్పించాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తిరుమల కొండయ్య, సుదర్శనమ్మ, భాస్కర్, కృష్ణారెడ్డి, బాల పుల్లయ్య, విశ్వనాథరెడ్డి, సుధాకర్, విశ్రాంత ఉపాధ్యాయులు సంజీవరాయుడు పాల్గొన్నారు.

పిల్లలందరికీ ఆధార్ చేయించాలి

- మున్సిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలో అయిదేళ్లలోపు పిల్లలందరికీ ఆధార్ కార్డు చేయించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మహిళా పోలీస్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ఈ కార్యక్రమాన్ని విధిగా చేయించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే చిన్నపిల్లలకు కూడా ఆధార్‌కార్డు తప్పనిసరి అన్నారు.


ప్రొద్దుటూరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

డయేరియాపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

డయేరియా వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆరోగ్యకేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు డయేరియా, దాని వల్ల సంభవించే మరణాలను పూర్తిగా అరికట్టడమే మన లక్ష్యమన్నారు. ఇందుకు ప్రతి ఆరోగ్య కార్యకర్త, ఆశాలు సమష్టి కృషి చేయాలన్నారు. చిన్నపిల్లలున్న ప్రతి ఇంటికి ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలన్నారు. ఇంటిలో ఒఆర్‌ఎస్ తయారీ విధానం, డయేరియా సోకితే తీసుకోవాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఒఎం సుబ్బారెడ్డి, వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాపాడు : గ్రామాల్లో ఆశా కార్యకర్తలు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని పిహెచ్‌సి వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం ఆయన ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ అతిసారా నియంత్రణ, కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. సూపర్‌వైజర్ సరస్వతి, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు భాస్కర్, రమేష్, ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బి.లక్ష్మీదేవి

బిసిలకు చేసిందేమీలేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తెలుగుదేశం పార్టీ బిసిలకు చేసిం దేమీలేదని పలువురు బిసి నాయకులు పేర్కొన్నారు. స్థానిక దేవాలయంలో మంగళవారం వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మిదేవి మాట్లాడుతూ 41 కౌన్సిలర్లలో టిడిపి పక్షాన ఉన్న ఒక్క కౌన్సిలర్‌ను నిలుపుకోలేక సస్పెండ్ చేసిందన్నారు. ఎంపిపి సానబోయిన శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ బిసిలను చట్టసభలకు పంపాలని స్థానిక బిసి నాయకుడు బొర్రా రామాంజనేయులు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌ను పాదయాత్ర సందర్భంగా అడిగితే లోకేష్ శవ రాజకీయాలు మాట్లాడారని దుయ్యబట్టారు. వైసిపి పలువురు బిసి నాయకులను చట్టసభలకు పంపిందని గుర్తు చేశారు. 2021 స్థానిక ఎన్నికలే బిసి నాయకులకు వైసిపి చేసిన మేలుకు నిదర్శనమని అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రెండు పార్టీల మెనిఫెస్టోలే రెఫరెండం అన్నారు. 2024 ఎన్నికల్లో టిడిపికి డిపాజిట్ దక్కదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిట్టా బాలాజీ, పలువురు బిసి నాయకులు మాట్లాడారు.


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

ప్రజాశక్తి - ముద్దనూరు

వేరుశనగ పంటలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఎఒ వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని కొలవలి, ఉప్పలూరు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం వేరుశనగ పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ వేరుశెనగ పూత దశలో ఊడలు దిగే సమయంలో ఎకరాకు 250 కిలోల జిప్సం వేసి, నీరు పెడితే గింజ నాణ్యంగా ఏర్పడి మంచి నూనె శాతం పెరుగుతుందన్నారు. వేరుశనగ పంటలో ఇనుప ధాతులోపం ఎక్కువగా కనిపిస్తోందన్నారు. నేల బెట్టకు నీటి ఎద్దడికి గురైనప్పుడు ఇనుప ధాతులోపం కనిపిస్తుందన్నారు. ముఖ్యంగా సున్నం పాలు లేదా చౌడు భూముల్లో అధికంగా ఆశిస్తుందన్నారు. మొదట ఏ పంటలో అయినా లేత ఆకుల మీద ఇనుప ధాతులోపం లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇనుము లోపం కనిపించిన లేత ఆకుల్లో ఈనెలు పసుపు వర్ణంగా మారుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు



మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి శివశంకర్‌రెడ్డి

విద్యార్థులు ప్రతి రోజూ క్రమం తప్పకుండా పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారి జె.శివశంకర్ రెడ్డి సూచించారు. గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిం చారు. అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. వేసవి శిబిరాలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. అన్ని రంగాల్లో విద్యార్థులకు వరుస క్రమంలో శిక్షణ ఇప్పిస్తామన్నారు. డ్రాయింగ్, పెయింటింగ్, కథలు, సంగీతం వంటి అంశాలు ఉన్నాయన్నారు.